క్లుప్తంగా

మరమ్మతు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న అధికారులు

రామడుగు: మండలంలోని షానగర్ నుంచి కోరటపల్లి ద్వారా కొత్తపల్లి వరకు రోడ్డు మరమ్మతు పనులను ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం ప్రారంభించారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారని బీజేపీ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద ఆందోళన చేయడంతో అధికారులు స్పందించారు. బీజేపీ పోరాటంతోనే పనులు ప్రారంభమయ్యాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్‌యాదవ్ తెలిపారు.

దిష్టిబొమ్మ దహనం



ఇల్లందకుంట: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేవైఎం నాయకుడు మట్ట పవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఉత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, గోపాల్, జగన్‌రెడ్డి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడులు పంపిణీ



విద్యార్థులతో జగదీశ్వర్, టీచర్లు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గంగిశెట్టి జగదీశ్వర్ పరీక్ష ప్యాడులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎంఈవో కె.రాములు హాజరై మాట్లాడారు. తల్లిజ్ఞాపకార్థం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేయడం అభినందనీయమని, రాబోయే పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.జయప్రకాశ్, టీచర్లు సీహెచ్.వేణు, కె.శంకర్, సమ్మిరెడ్డి, సత్యం, కౌసల్య, ఉమాదేవి, ఏ.మనోహర్‌రెడ్డి, ఎం.సుధాకర్, జి.అన్నపూర్ణ, సీహెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా



ఆర్థిక భరోసా అందుకున్న లబ్ధిదారులు

గంగాధర: తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు సభ్యత్వం తీసుకున్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కింద నెలకు రూ. వెయ్యి చొప్పున అందజేస్తున్నామని ట్రస్టు ప్రాజెక్టు డైరెక్టర్ జోగు పోలు తెలిపారు. మండలంలోని నారాయణపూర్, మల్లాపూర్, మంగపేట గ్రామాల్లోని ముప్పై కుటుంబాలకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి సురేష్, ఎంసీవో సతీష్, అఖిల్, అనిల్, గంగాధర్, చిరంజీవి ఉన్నారు.

హైదరాబాద్‌కు కౌలు రైతులు



జమ్మికుంట: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించి కౌలు రైతుల ప్రజా దర్బార్‌కు మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కౌలు రైతుల హామీలను నెరవేర్చలేదన్నారు. సయుక్త కిసాన్ మోర్చా భాగస్వామ్య సంస్థ రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో కౌలు రైతుల కోఆర్డినేటర్ ఐలయ్య, సామ్రాజ్యం, సదానందం, సమ్మయ్య, రామకృష్ణ, కౌలు రైతులు సకర్మ వెంకటేశ్, రమేశ్, శ్రీనివాస్, గట్టయ్య, మహేశ్, అంజి, ఐలయ్య, మధుకర్ తరలి వెళ్లారు.

గొడ్డలితో దాడి

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో వంతడ్పుల గణేశ్‌పై గొడ్డలితో దాడి చేసినవారిపై బుధవారం కేసు నమోదు చేశామని ఎస్సై రవి తెలిపారు. గ్రామానికి చెందిన వంతడ్పుల లక్ష్మి, తిలక్‌సాయి గొడ్డలితో దాడి చేశారని గణేశ్ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

పట్టుదలే పెట్టుబడిగా

- ఖాకీ కొలువు సాధించిన యువత
- యూనిఫాం ధరించి విధుల్లో చేరిన సివిల్ కానిస్టేబుళ్లు
- పోలీసుశాఖకు మంచిపేరు తీసుకొస్తామంటున్న ఉద్యోగులు



ప్రజలకు పోలీసుశాఖ రూల్స్ వివరిస్తున్న నూతన కానిస్టేబుళ్లు

హుజూరాబాద్: వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాల బిడ్డలు.. చదువునే నమ్ముకొని పట్టుదలనే పెట్టుబడిగా పెట్టి ప్రభుత్వ కొలువే లక్ష్యంగా శ్రమించారు. ఖాకీ యూనిఫాం ధరించాలని కలలు కన్నారు. ప్రణాళికతో చదివి.. పట్టుదలతో కల సాకారం చేసుకున్నారు. ప్రజలకు భద్రత కల్పించాలన్న లక్ష్యంతో పోలీస్ శాఖలో చేరారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవ చేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకొస్తామని కొత్తగా ఉద్యోగంలో చేరిన కానిస్టేబుళ్లు పేర్కొంటున్నారు.

ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారు. ప్రజలకు సేవలందించాలన్న సంకల్పంతో కొలువు సాధించి విధుల్లో చేరారు. మహిళా కానిస్టేబుళ్ల రాకతో వివిధ సమస్యలతో ఠాణా మెట్లు ఎక్కే మహిళలకు భరోసా ఏర్పడనుంది. డివిజన్ వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో విధుల్లో చేరిన కొత్త కానిస్టేబుళ్లకు విధుల నిర్వహణపై సీఐ, ఎస్‌ఐలు ప్రత్యేక ట్రెనింగ్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, డ్రంకెన్‌డ్రైవ్, వాహనాల తనిఖీతో పాటు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పోలీసుశాఖ నిర్వహించే విధులు, వివిధ రికార్డుల నిర్వహణ, కేసుల పరిష్కారం కోసం చేపట్టే చర్యలు వివరిస్తున్నారు.

డివిజన్ వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో విధుల్లో చేరిన కానిస్టేబుళ్ల వివరాలు

మండలం	మేల్	ఫిమేల్
హుజూరాబాద్	12	4
కేశవపట్నం	7	3
సైదాపూర్	7	3
జమ్మికుంట	9	4
వీణవంక	8	3
ఇల్లందకుంట	9	3
మొత్తం	52	20



కానిస్టేబుళ్ల విధులపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

మంచిపేరు తెచ్చుకుంటా



మాది జమ్మికుంట మండలం విలాసాగర్. నాన్న కిరాణ షాపు నిర్వహిస్తూ నన్ను బీటెక్ చదివించారు. నాన్న గర్వపడేలా చేయాలన్న ఉద్దేశంతో పోలీసు కొలువు సాధించాను. విధుల్లో లోటుపాట్లు లేకుండా క్రమశిక్షణతో మంచిపేరు తెచ్చుకుంటాను.

– బిట్ట అనిల్‌కుమార్, విలాసాగర్

అమ్మానాన్న కష్టపడి చదివించారు



మాది కరీంనగర్, పీజీ వరకు చదివాను. పోలీసు కొలువే లక్ష్యంగా పరీక్షకు సిద్ధమయ్యాను. అమ్మానాన్న కష్టపడి చదివించారు. నాన్న వ్యవసాయం చేస్తూ పరీక్షలకు సిద్ధమవుతున్న నన్ను ఎంతో ప్రోత్సాహించారు. 9 నెలల శిక్షణలో ఎన్నో నేర్చుకున్నాను.

– మాధవి అనిత, కరీంనగర్

లక్ష్యంతో కొలువు సాధించా



ప్రజలకు సేవ చేయడానికి పోలీసు ఉద్యోగం తోడ్పడుతుందనే లక్ష్యంతో కొలువు సాధించాను. గుర్తింపు తెచ్చుకునేలా విధులు నిర్వహిస్తాను. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ చదివించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి మంచిపేరు తెచ్చుకుంటా.

– వినయ్‌కుమార్, లక్ష్మాజీపల్లి

అంకితభావంతో పనిచేయాలి



అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుంది. సమయంతో సంబంధం లేకుండా శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా శ్రమించాలి. కష్టపడే తత్వం, విభిన్న కోణంలో సమస్యలకు పరిష్కారం చూపేవారు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు.

– శ్రీనివాస్‌జీ, ఏసీపీ, హుజూరాబాద్

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

చిగురుమామిడి: ఉల్లంపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బుధవారం విన్నవించారు. హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. గతంలో మడద, బంటుపల్లి, ఉల్లంపల్లి, సుందరగిరి, చిగురుమామిడి ద్వారా కరీంనగర్‌కు బస్సు సర్వీసు ఉండేదని, గత ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లేవారు అనేక అవస్థలు పడుతున్నారని వివరించగా మంత్రి సానుకూలంగా స్పందించారని కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు కానవేని శివకుమార్ తెలిపారు.



తిమ్మాపూర్: క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

టీషర్టులు వితరణ

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పిరమిడ్ క్యాపిటల్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో బుధవారం టీషర్టులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో పిరమిడ్ క్యాపిటల్ ఫైనాన్స్ ఉమ్మడి కరీంనగర్, సిద్దిపేట, మంచిర్యాల జిల్లాలకు చెందిన బ్రాంచ్ ఉద్యోగులు క్రీడా ఉత్సవ్ 2.0 పేరుతో క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో వివిధ ఆటలు ఆడారు. ఈసందర్భంగా ఫైనాన్స్ క్లస్టర్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్లు జాజిమొగ్గుల మధు, కానుగంటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. క్రీడలతో స్నేహం భావం పెంపొందుతుందని, మానసిక, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడాపోటీలు నిర్వహించామన్నారు. ఫైనాన్స్ రికవరీ మేనేజర్ బూరుగు రామిరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తోట కొంరయ్య, ఓదయ్య క్రీడా దుస్తులు, టై, బెల్టులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



శంకరపట్నం: క్రీడా దుస్తులతో విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు పట్టణంలోని కాసం ఫ్యాషన్‌షాపు ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆశ్రమాన్ని సందర్శించి దివ్యాంగులకు కావాల్సిన సహాయ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో షాపు యజమాని ప్రవీణ్‌కుమార్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బుచ్చిరాములు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: దుప్పట్లు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

దరఖాస్తుల ఆహ్వానం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ పరిధి కేజీబీవీ ఖాళీగా ఉన్న తాత్కాలిక పీజీ సీఆర్‌టీ నర్సింగ్‌పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి పి.కవిత ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ నర్సింగ్ చేసిన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామం కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ స్వప్న ప్రకటనలో తెలిపారు. హిందీ పోస్టుకు ఎంఏ హిందీ, బీఈడీ, పీజీ నర్సింగ్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్, సివిక్స్ పోస్టుకు ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ చేసిన స్థానిక మహిళలు కేజీబీవీ ఎస్‌వో 9640418320 నంబర్ సంప్రదించాలన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని కేజీబీవీలో పీఈటీ, పీజీసీఆర్‌టీ నర్సింగ్ అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి ఎలిగేటి లావణ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు 9849630792 నంబర్ సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మోడల్ స్కూల్ విద్యార్థిని



జయశ్రీని అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్, అధ్యాపకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని తాళ్ల జయశ్రీ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ సరిత తెలిపారు. 52వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జయశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో బుధవారం మోడల్‌స్కూల్‌లో ప్రిన్స్‌పాల్, అధ్యాపకులు అభినందించారు.

వెన్నెంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నాస్–2024 పరీక్ష

సైదాపూర్: దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నాస్–2024 పరీక్ష విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలతో పాటు తదుపరి విద్యా లక్ష్యాలను ఏర్పరచుకోవడంలో ఉపయోగపడుతుందని ఎంఈవో కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెన్నెంపల్లి ఉన్నత పాఠశాలలో నాస్–2024 పరీక్షను నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలో పాల్గొన్నారు. పరిశీలకుడిగా రుక్మాపూర్ సైనిక్ స్కూల్ యోగేశ్వర్ వ్యవహరించారు. ఫీల్డ్ ఇన్వేస్టర్‌గా లక్ష్మీప్రసన్న, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి సర్వేలో పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

చొప్పదండి: గ్రామాల్లో రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని పశు సంపద అభివృద్ధికి పాటుపడాలని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ కోరారు. మండలంలోని గుమ్లాపూర్, రాగంపేట గ్రామాలలో బుధవారం కోరుట్ల పశు వైద్య కళాశాల వైద్యులు, విద్యార్థుల ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులను పరీక్షించి వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ శశికాంత్ రెడ్డి, రామక్రిష్ణ, శ్యాంసుందర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, నాగరాజు, ప్రియాంక, శకారం, శ్రీనివాస్, సందీప్, సురేశ్, ఐలయ్య, అనిల్, తిరుపతి, సింగిరెడ్డి క్రిష్టారెడ్డి, తదితదరులు పాల్గొన్నారు.



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మహేశ్

పెద్దపల్లికి తరలిన నాయకులు

హుజూరాబాద్: పెద్దపల్లి జిల్లాలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు బుధవారం తరలివెళ్లారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఓర్వలేక బీఆర్‌ఎస్, బీజేపీ నాయకలు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అనంతరం జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

జమ్మికుంట: పట్టణం, మండలంలోని కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి సభకు భారీగా తరలివెళ్లారు. కొత్తపల్లిలో ప్రణవ్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. దేశినికోటి, నాయకులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ నుంచి తరలివెళ్తున్న నాయకులు

నియామకం



హుజూరాబాద్: పట్టణానికి చెందిన చల్లూరి రాహుల్ యువజన కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా గెలుపొందారు. 28 మంది పోటీ చేయగా రాహులు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి సంపత్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

గంగాధర: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని గర్శకుర్తి గ్రామంలో బుధవారం పట్టుకొని సీజ్ చేశామని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లి మండలం ఖాజీపూర్ నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న డ్రైవర్లు కొమ్మూరి ఉదయ్, ఇల్లందుల అరుణ్‌కుమార్, యజమానులు ఇల్లందుల సతీశ్, దాసారపు వెంకటేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు.



హుజూరాబాద్: మున్సిపల్ పరిధిలోని దమ్మక్కపేటలో నివాస గృహాల మధ్యలోని ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలుస్తోంది. దీంతో భరించలేని దుర్వాసన వెలువడుతోందని, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారులు
సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్, సెల్ నం. 7032651516

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

గురుకుల పాఠశాల సందర్శన

హుజూరాబాద్: పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను బీఆర్‌ఎస్వీ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏదైనా సహాయం లేదా సమస్య ఉంటే హెల్ప్ లైన్ నెంబర్‌కి ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ పట్టణ అధ్యక్షుడు వీడెపు అనురాగ్, నాయకులు కిరణ్, అనుదీప్, అరవింద్, విజయ్, గాలిసాయి, అకాష్, మహేష్, కౌన్సిలరయ్ల లావణ్య, ఉస్మాన్ ఉరేస్, శ్రీదేవి ఉన్నారు.

రామడుగు: మండలంలోని మోడల్ స్కూల్, బాలుర వసతి గృహం, కేజీబీవీలను బుధవారం బీఆర్‌ఎస్వై కరీంనగర్ జిల్లా గురుకుల బాట ఇన్‌చార్జి ఆవాల హరిబాబు ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతులను తనిఖీ చేశారు. బీఆర్‌ఎస్వై నాయకులు మధుసూదన్‌రెడ్డి, బందారపు అజయ్‌గౌడ్, ఆరపల్లి ప్రశాంత్, బండారి చరణ్, మధు, సముద్రాల ఓంకార్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, నాయకులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

శంకరపట్నం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీడీవో కృష్ణప్రసాద్ పరిశీలించారు. కేంద్రాల్లో వసతులను ఏఈ మల్లేశంతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. 7న గ్రామ పంచాయతీ ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేయనున్నామని తెలిపారు.



మెట్‌పల్లిలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీచర్లు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, జోసెఫ్, రాము తదితరులు

జవాన్‌కు సన్మానం

మానకొండూర్‌రూరల్: మండలంలోని లింగాపూర్ గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బీఎస్‌ఎఫ్ జవాన్ మార్క కిరణ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడారు. దేశభక్తి, సైనికుల క్రమశిక్షణ, ధైర్యం, తెగువ గూర్చి వివరించారు. విద్యార్థులు శారీరకంగా ధృడంగా ఉండాలని, నిర్దేశించుకున్న లక్ష్య సాధించేందుకు కృషి చేయాలని, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, జోసెఫ్, రాము, సుభాషిని, పద్మ, మాధవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● సర్టిఫికెట్ వెరిఫికేషన్

తిమ్మాపూర్: కరీంనగర్ ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) 2024–25 లో మొదటి సంత్సరం చేరుటకు నిర్వహించిన డీసెట్‌లో ఉత్తీర్ణులై సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోనివారికి అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. సెకండ్ ఫేజ్ ప్రవేశాలకు పాత కరీంనగర్ జిల్లా అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 5న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

● అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ అంగారక టౌన్‌షిప్‌లో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు.

● ఎదురెదురుగా బస్సు, కారు ఢీ

హుజూరాబాద్: పట్టణశివారులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో కరీంనగర్– వరంగల్ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారులో ప్రయాణిస్తున్న హన్మకొండకు చెందిన సీడ్ వ్యాపారికి తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

● క్వింటాల్ పత్తి రూ.7,100

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,100 పలికింది. మోడల్ ధర రూ.7,050, కనిష్ఠ ధర రూ.6,600కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు.

● అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

సైదాపూర్: మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు.

● స్వల్ప భూకంపం

హుజూరాబాద్: పట్టణంలోని వివిధకాలనీతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున భూమి స్వల్పంగా కంపించింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

చిగురుమామిడి: మండలంలోని పలు గ్రామాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఇంట్లోని వస్తుసామగ్రి కదిలాయని ప్రజలు తెలిపారు.

● పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి

వీణవంక: సీఎం కప్ ఆటల పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

● మాజీ సర్పంచ్ మృతి

చొప్పదండి: చొప్పదండి సర్పంచ్‌గా పని చేసిన సిరిపురం భద్రయ్య (90) బుధవారం మృతి చెందారు. చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా, మేనేజర్‌గా, సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేశారు.